జాతీయ లోక్ అదాలత్ వాయిదా

పార్వతీపురం, మే3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పార్వతీపురంలోని కోర్టులో ఈ నెల 11న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం వాయిదా పడింది. రెండో శనివారం, పోలింగ్, అధిక ఎండల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వచ్చేనెల 29న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కక్షిదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.





నా ఎస్టీ అన్నారు.. గాలికొదిలేశారు



- గిరిజన గర్భిణుల వసతి గృహాలను పట్టించుకోని జగన్
- నిర్వహణ కోసం నిధులు కేటాయించని వైనం
- సిబ్బందికి సక్రమంగా జీతాలూ చెల్లించని ప్రభుత్వం
- అరకొరగానే పౌష్టికాహారం పంపిణీ
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభం
- నాడు కేంద్ర బృందంతో ప్రశంసలు
- వైసీపీ పాలనలో దయనీయ స్థితి
- సర్కారు తీరుపై గిరిజన సంఘాల ఆగ్రహం

(గుమ్మలక్ష్మీపురం/సాలూరు/సీతంపేట)

'గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం.. వారి అభ్యున్నతికి పెట్టపీట వేస్తాం.. విద్య, వైద్యకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.. మెరుగైన వసతులు కల్పిస్తాం' అని గత ఎన్నికల సమయంలో జగన్ హామీలిచ్చారు. మాట్లాడిన ప్రతిచోటా 'నా ఎస్సీ.. ఎస్టీలు' అంటూ ఓట్లు దండుకున్నారు. అయితే అధికారంలోకి వచ్చాక అసలు రూపం చూపించారు. గిరిజనులకు మొండిచేయి చూపారు. ప్రధానంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన గర్భిణుల వసతిగృహాలను గాలికొదిలేశారు. ఐదేళ్ల పాలనలో వాటి నిర్వహణకు సక్రమంగా నిధులను కేటాయించకపోగా.. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి కూడా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదు. దీంతో వాటి పరిస్థితి దయనీయంగా మారింది. మొత్తంగా గిరిజన గర్భిణుల వసతి గృహాలను వైసీపీ సర్కారు పట్టించుకోకపోవడంపై జిల్లావాసులు, గిరిజన సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అండగా నిలవాల్సిన సర్కారు.. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగునా? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.



సాలూరులో గిరిజన గర్భిణుల వసతి గృహం



గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరిలో గిరిజన గర్భిణుల వసతిగృహం

వైసీపీ పాలనలో..

వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత సీన్ మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లో మాతా శిశు మరణాలను అరికట్టాలనే ఉద్దేశంతో ఐటీడీఏల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజన గర్భిణుల వసతి గృహాలు అధ్వానంగా మారాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో లక్ష్యం నీరుగారింది. వాటి నిర్వహణను పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో గర్భిణులకు సేవలు అందడం లేదు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి కూడా జీతాలు కూడా చెల్లించడం లేదు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్న ఏజెన్సీలకు నెలలు తరబడి బిల్లులు చెల్లించడం లేదు. ఒకప్పుడు గవర్నర్, కేంద్ర బృందంతో ప్రశంసలు అందుకున్న వసతిగృహాలు ఇలా మారడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని వందలాది గిరిజన గ్రామాలకు సరైన రహదారి సదుపాయం లేదు. కొండ శిఖర గ్రామాల్లో పరిస్థితి అయితే సరేసరి. దీంతో అత్యవసర వేళల్లో ఆయా ప్రాంతవాసులకు డోలీలే దిక్కవుతున్నాయి. కాగా ఒక్కోసారి గిరిజన గర్భిణులు మార్గమధ్యంలో ప్రసవం కావడం, మాతా, శిశు మరణాలు సంభవించడం వంటివి జరిగేవి. అయితే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదని, గిరిజన గర్భిణులు ప్రసవ కష్టాలు పడరాదని గత టీడీపీ ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఐటీడీఏల ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని గుమ్మ లక్ష్మీపురం మండలంలోని భద్రగిరి, సాలూరులో ఉన్న వైటీసీల్లో గిరిజన గర్భిణుల కోసం వసతిగృహాలను ప్రారంభించారు. అప్పట్లో వాటికి ప్రత్యేక అంబులెన్సులను కూడా ఏర్పాటు చేశారు. డెలివరీకి ముందు వసతి గృహాల్లో చేరుకునే గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందించేవారు. ఫుడ్ బకెట్ పేరుతో పాలు, గుడ్లు, పండ్లు, మిఠాయి, ఖర్జూరం, శనగ చిక్కీలు, రాగిజావ ఇచ్చేవారు. రోజూ రక్తహీనత, బీపీ, షుగర్ పరీక్షలు చేసి కంటికి రెప్పలా చూసుకునేవారు. యోగా కూడా చేయించేవారు. వైద్య సాయం కోసం ముగ్గురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు వైద్య సహాయకులు, అంబులెన్స్ డ్రైవర్, హౌస్ కీపింగ్‌కు ఇద్దరు, ముగ్గురు అటెండర్లను నియమించారు. వారికి ఐటీడీఏల నుంచి జీతాలు చెల్లించేవారు. ప్రసవ సమయం దగ్గర పడిన వారికి సమీపంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీకి తరలించేవారు. ప్రసవం జరిగిన తరువాత తల్లీ బిడ్డను క్షేమంగా ఇంటికి పంపించే కార్యక్రమం చేపట్టేవారు. అప్పట్లో వాటి నిర్వహణ, సిబ్బంది జీతాలు, ఇతరత్రా ఖర్చుల కోసం ఏడాదికి సుమారు రూ.3 కోట్లు వరకు కేటాయించేవారు. మొత్తంగా జిల్లాలో మాతాశిశు మరణాల సంఖ్యను బాగా తగ్గించారు.

భద్రగిరిలో ఇలా..

గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరిలో ఉన్న వసతిగృహంలో ప్రస్తుతం 26 మంది గిరిజన గర్భిణులే ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి 12 నెలలుగా జీతాలు అందడం లేదు. అంబులెన్స్ మరమ్మతు గురైన వెంటనే బాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. నిధుల కొరత కారణంగా వసతిగృహం నిర్వహణ గాడి తప్పింది. మరుగుదొడ్లు కూడా అధ్వానంగా మారాయి. వాటిపై అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. దీంతో ఇక్కడకు వచ్చేందుకు గిరిజన గర్భిణులు ఆసక్తి చూపడం లేదు. గతంలో 40 నుంచి 50 మంది వరకు ఇక్కడ గర్భిణులు ఉండగా.. ఇప్పుడా పరిస్థితి లేదు. దీనిపై ఐటీడీఏ ఏపీవోను వివరణ కోరగా వసతిగృహంలో పనిచేస్తున్న సిబ్బందికి 12 నెలల జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు పెట్టామని, మంజూరవ్వగానే వారికి చెల్లిస్తామని వెల్లడించారు.

సాలూరులో ఇలా..

సాలూరులోని వసతి గృహంలో 15 మంది లోపే గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజన గర్భిణులు ఉన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి కూడా పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించడం లేదు. సర్కారు నిధులు కేటాయించకపోవడంతో ఇక్కడ మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. అరకొరగానే గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందనే విమర్శలున్నాయి. మరోవైపు ఇక్కడున్న గిరిజన గర్భిణులకు వేడి నీళ్లు అందడం లేదు. దీంతో వారు ఆరుబయటే నీరు కాచుకుని తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. 2018-2019లోనే ఈ వసతి గృహం నుంచి అత్యధికులు ప్రసవమయ్యారు. అయితే వైసీపీ వచ్చిన తర్వాత వాటి నిర్వహణ గాడి తప్పడంతో ఇక్కడకు వచ్చే గిరిజన గర్భిణుల సంఖ్య బాగా తగ్గింది.

వసతి గృహాలను మెరుగుపర్చాలి..

గిరిజన గర్భిణులకు ఎంతో ఉపయోగకరమైన వసతి గృహాలపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. తక్షణవే వాటిని పూర్తిస్థాయిలో మెరుగుపర్చాలి. నిర్వహణ లోపాలు లేకుండా చూడాలి. సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-కద్రక మల్లేష్, గిరిజన సంఘం నాయకుడు, గుమ్మలక్ష్మీపురం



సీతంపేటలో వినియోగంలోకి రాని బెర్త్ హోమ్ కేంద్రం

ఎన్నికల ముందు హడావుడి..

హైరిస్క్ గిరిజన గర్భిణుల కోసం గత టీడీపీ హయాంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి సమీపంలో బెర్త్‌హోమ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నలుగురు ఉండే విధంగా అన్ని వసతులు సమకూర్చారు. అప్పట్లో ఇవి గిరిజన గర్భిణులకు ఎంతో ఉపయోగపడేవి. వారికి సమయానికి పౌష్టికాహారం, వైద్యపరీక్షలు అందేవి. ప్రసవానికి ఇబ్బందులు ఉండేవి కాదు. డోలీ కష్టాలు తప్పేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బెర్త్‌హోమ్ కేంద్రానికి నిధులు కేటాయించడం మానేసింది. దీంతో ఐదేళ్లుగా అవి పూర్తిగా మూతపడ్డాయి. గర్భిణులకు సేవలు దూరమయాయి. అయితే ఎన్నికల నేపథ్యంలో ఇటీవల బెర్త్‌హోమ్ కేంద్రం అందు బాటులోకి తేవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేశారు. దీంతో ఆ కేంద్రానికి మరమ్మతులు చేపడతామని లాంఛనంగా కొబ్బరికాయ చేతులు దులుపుకున్నారు. ఇప్పటివరకు ఎటువంటి పనులు చేయలేదు. కేంద్రం కూడా ప్రారంభించలేదు. దీనిపై గిరిజనులు, సంఘ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మాపై ఎందుకీ కక్ష?

- రెండోరోజూ.. పింఛన్‌దారులకు తప్పని అవస్థలు
- బ్యాంకుల వద్ద పడిగాపులు
- మండుటెండలో దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు, దివ్యాంగులు విలవిల
- వైసీపీ సర్కారు తీరుపై మండిపాటు



సాలూరులో ఓ సేవా కేంద్రం వద్ద పింఛన్ల నగదు కోసం ఎండలోనే ఉన్న లబ్ధిదారులు

పార్వతీపురం, మే3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్‌దారులకు రెండో రోజూ ఇబ్బందులు తప్పలేదు. పింఛన్ సొమ్ము కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. వైసీపీ సర్కారు అనాలోచిత నిర్ణయంతో వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడ్డారు. మరోవైపు మండుటెండలో విలవిల్లాడుతూ బ్యాంకులు, వాటి సేవా కేంద్రాలకు చేరుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అయితే ఆయా చోట్ల కూర్చొనేందుకు, కాసేపు విశ్రాంతి తీసుకునే అవకాశమూ లేక మరిన్ని ఇక్కట్లు పడ్డారు. దీంతో వారంతా వైసీపీ సర్కారుపై మండిపడ్డారు. తమపై ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా.. ఇలా బ్యాంకుల వద్ద క్యూలైన్లలో గంటలకొద్దీ నిరీక్షించేలా చేసిన సర్కారుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివిధ చోట్ల ఇలా..

బ్యాంకులో ఖాతా ఉన్నప్పటికీ అప్‌డేట్ కాకపోవడం.. ఆధార్ అనుసంధానం లేకపోవడం... ఫింగర్‌ప్రింట్లు స్కాన్ కాకపోవడం వంటి సమస్యలతో శుక్రవారం అనేక మంది పింఛన్లు తీసుకోలేకపోయారు. అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, దివ్యాంగులు కుటుంబ సభ్యులను తోడుతీసుకుని బ్యాంకుల వద్ద వారు పడిన పాట్లు అన్నీఇవన్నీ కావు. ఖాతాల్లో నగదు జమైనా ఇంకా డబ్బులు చేతికి రాకపోవడంతో మరికొందరు ఉసూరోమంటూ ఇంటికి వెనుదిరిగారు.

- **సాలూరు:** పట్టణంలో ఉన్న బ్యాంకులు, వినియోగదారుల కేంద్రాల వద్ద శుక్రవారం పింఛన్‌దారులు బారులుదీరారు. ఉదయం పది గంటలకు ముందే అక్కడకు చేరుకుని, తమ ఖాతాలో పింఛన్ పడిందా? లేదా అని ఆరా తీశారు. వృద్ధులు సైతం ఎండలో నానా అవస్థలు పడ్డారు.
- **మక్కువ:** మక్కువ, మార్కొండపుట్టి, శంబర గ్రామాల్లో ఉన్న బ్యాంకుల్లో వృద్ధులు భారీగా క్యూ కట్టారు. గిరి శిఖర గ్రామాల లబ్ధిదారులైతే ఆటోల్లో బయలుదేరి బ్యాంకులు, సీఎస్‌పీ సెంటర్లకు తరలివచ్చారు. కాగా సీఎస్‌పీ సెంటర్ల వద్ద ఎండలో నేలపై కూర్చోలేక పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. ఆధార్ సీడింగ్ అవ్వలేదని, ఈకేవైసీ చేయించుకోవాలని బ్యాంకర్లు చెప్పినా.. వృద్ధులు ఓపికతో పని అయ్యేంతవరకు నిరీక్షించి పింఛను నగదు పొందారు. కొంతమంది ప్రైవేటు నగదు బదిలీ నిర్వాహకులు రూ.3 వేల పింఛన్ సొమ్ములో రూ.30 వసూలు చేశారు.
- **భామిని:** లివిరి గ్రామానికి చెందిన వృద్ధుల బ్యాంకు ఖాతాలు లాక్ అవడంతో వారంతా ఇబ్బందులు పడ్డారు. చివరకు తమ సమస్యలను బ్యాంకు అధికారులకు విన్నవించి అకౌంట్లను ఓపెన్ చేసి బ్యాంకు మిత్రల ద్వారా పింఛన్ల సొమ్ము అందుకున్నారు. మరికొందరి ఖాతాలకు ఆధార్ లింక్ కాకపోవడంతో పింఛన్ సొమ్ము అందుకోలేకపోయారు. ఇంకొందరి ఖాతాల్లో పింఛన్ పడిందో లేదో.. తెలియని పరిస్థితి.
- **జియ్యమ్మవలస :** మండలంలో 9,110 పింఛన్లకు గాను 6,892 మంది ఖాతాల్లో నగదు జమ చేశారు. అయితే అనేకమంది పింఛన్‌దారులు ఎండలో కిలో మీటర్ల మేర ప్రయాణించి.. బ్యాంకుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- **వీరఘట్టం:** మండలంలోని వృద్ధులు పింఛను డబ్బులు కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఉదయాన్నే వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వృద్ధులు ఆటోలపై వచ్చి బ్యాంకుల వద్దకు చేరుకున్నారు.
- **పాలకొండ:** స్థానిక ఖాతాదారుల సేవా కేంద్రంలో శు క్రవారం పింఛనుదారులు క్యూలో నిలబడి నగదు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఖాతాదారులు సేదతీరేందుకు అవకాశం లేకపోవడంతో ఎండలోనే తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- **సాలూరు రూరల్:** మామిడిపల్లి,తోణాంలో ఉన్న బ్యాంకులకు శుక్రవారం భారీగా పింఛన్‌దారులు తరలివచ్చారు. గిరిశిఖర డెన్స్‌రాయి, సంపంగిపాడు,రూఢి తదితర గిరిజన గ్రామాల ప్రజలు నుంచి ఎండను లెక్కచేయకుండా బ్యాంక్‌కు రావాల్సి వచ్చింది. కొందరు కురుకూటిలో బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ వద్ద సొమ్ము డ్రా చేశారు. కురుకూటిలో సిగ్నల్ సమస్య ఉండడంతో ఊరి బయట చెట్టు కిందకు వెళ్లారు. వృద్ధుల వేలిముద్రల నమోదు సమస్య రావడంతో పింఛన్ ఇవ్వడానికి వీలుకాలేదు.
- **బలిజిపేట:** మండలంలో కొందరి పింఛన్‌దారుల ఖాతాల్లో సరిపడా నగదు లేక రద్దయ్యాయి. అయితే వెంటనే ఖాతా రెన్యూవల్‌కు అధిక సమయం పడడంతో వృద్ధులు సాయంత్రం వరకు బ్యాంకుల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది.
- **కురుపాం:** గుమ్మలక్ష్మీపుం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన గిరిజనులు కురుపాం బ్యాంక్ వద్దకు ఉదయం 9 గంటలకు పెద్ద ఎత్తున చేరారు.
- **సీతంపేట:** పక్షవాతంతో బాధపడుతున్న లాడ గ్రామానికి చెందిన బిడ్డిక రాజన్న పింఛన్ సొమ్ము కోసం భార్య సాయంతో మండుటెండలో శుక్రవారం సీతంపేటలో ఓ బ్యాంక్ వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. గెద్దగూడకు చెందిన సవర దొరమీ అనే వృద్ధురాలు కూడా బ్యాంకు వద్ద పెన్షన్ కోసం ఎదురుచూసింది. దివ్యాంగులు, వితంతువులు కూడా పెన్షన్ల కోసం నానా అవస్థలు పడ్డారు. వాస్తవానికి నడవలేని దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ఇళ్ల వద్దకే పింఛను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. అదెక్కడా అమలు కావడం లేదు. దీంతో మండుటెండలో పింఛన్‌దారులు కిలోమీటర్ల మేర ప్రయాణించి.. బ్యాంకుల వద్దకు చేరుకోవాల్సి వస్తోంది. అయితే ఆయా చోట్ల తాగునీరు కూడా అందించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

బ్యాంకులో లోన్ ఉందని ...



నేను గతంలో వ్యాపారం నిమిత్తం బ్యాంకుల రుణం తీసుకున్నా.. అయితే అనారోగ్యం, ఇతర సమస్యల కారణంగా సకాలంలో రుణం తిరిగి చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు నా ఖాతాలో జమైన వృద్ధాప్య పింఛను సొమ్మును అందించలేదు. ఆ సొమ్మును రుణం కింద జమ చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. దీనిపై లీడ్ బ్యాంకు అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలి.

- ఉత్తర కవట చిట్టిబాబు, సీతంపేట



మక్కువలో..



పింఛన్ కోసం బ్యాంకు వద్ద పక్షవాత బాధితుడు ఇలా..

తాలాడలో ఏనుగులు

భామిని: భామిని మండలం తాలాడ సమీపంలో గత రెండురోజులుగా గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి ఏకంగా అవి గ్రామ సమీపానికి చేరడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలెత్తిపోయారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు సాహసించలేకపోయారు. ఇన్నాళ్లు పల్లెల శివార్లలో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేసిన గజరాజులు ఇలా గ్రామ సమీపంలోకి రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల వల్ల ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని టెన్షన్ పడుతున్నారు. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టాలు సంభవించకముందే సంబంధిత అధికారులు స్పందించి వాటిని ఈ ప్రాంతం నుంచే తరలించే చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్తూరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణారావుతో పాటు పది మంది ట్రాకర్స్ ఏనుగుల సంచారంపై నిఘా వేశారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



తాలాడ గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

జన కేతనం
ఆంధ్రజ్యోతి
6 విజయనగరం పార్వతీపురం మన్యం
శనివారం 4 మే 2024
జిల్లాల వార్తలు

భూమి ఉంటేనే ఓటు హక్కు

మీకు తెలుసా

విజయనగరం: రాజ్యాంగం వచ్చిన కొత్తలో ఎన్నికల్లో ఓటు వేయాలన్నా... శాసన సభ్యుడిగా... ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేయలన్నా సంబంధిత వ్యక్తికి ఎంతో కొంత భూమి ఉండాలనే నిబంధన ఉండేది. అప్పట్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గౌతు లచ్చన్న ఎన్నికల్లో పోటీచేసే సమయంలో భూమి లేకపోతే పురుషోత్తపురానికి చెందిన కిల్లి అప్పలనాయుడు వద్ద నుంచి భూహక్కు పత్రం పొందిన తరువాత ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పట్లో 21 సంవత్సరాలు నిండిన వారికి... విద్యావంతులకే ఓటుహక్కు ఉండేది.



రాజకీయ అల్లరీ నేరమే

(కొమరాడ)

ఏదైనా రాజకీయ పార్టీ ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు... అక్కడ నిర్వహించే సమావేశాలను ఆ పార్టీకి సంబంధం లేని వ్యక్తి అడ్డుకోవడం... భంగ పరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. ప్రచార సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తి గురించి వివరాలు రాబట్టుకోవచ్చు. ఇక పోలీసులకు కూడా ఆ వ్యక్తి తన వివరాలను చెప్పకపోతే వారెంట్ లేకుండా అతడిని నిర్బంధంలోకి తీసుకోవచ్చు.



అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా

పెద్దల మాట

వీరఘట్టం: పాత కాలం ఎన్నికలకు... ఇప్పటి ఎన్నికలకు ఎంతో తేడా ఉంది. అప్పటి ఎన్నికల్లో గందరగోళం ఉండేది కాదు. ప్రశాంతగా ఎన్నికలు జరిగేవి. డబ్బు ప్రభావం ఉండేది కాదు. ఎవరికి నచ్చిన పార్టీకి వారు ఓటు వేసే వారం. ప్రజలకు మేలు చేసే వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారం. ఎన్నికలకు ముందు వారం పది రోజులు మాత్రమే ప్రచారాలు ఉండేవి. ఎన్నికల వరకే రాజకీయాలు. ఆ తర్వాత అందరం కలిసిమెలిసి ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. పార్టీల వారీగా విడిపోయి కక్షలకు పోతుండడం బాధగా ఉంది. ఆ రోజులు మళ్లీ ఎప్పుడు వస్తాయో. ఇప్పటి నాయకుల్లో రాజకీయ చైతన్యం ఎంతో ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గెలుపే లక్ష్యంగా ఇప్పుడు రాజకీయాలు సాగుతుండడం దురదృష్టకరం.

- నడికట్ల రామచంద్రరావు (వయస్సు 80), వీరఘట్టం, పార్వతీపురం మన్యం జిల్లా



విశిష్టతల సంగమం.. రాజాం

- చారిత్రక ప్రదేశాలు
- విశిష్ట వ్యక్తులు
- వింతలు, విశేషాల కలబోత

(రాజాం రూరల్)

రాజాం.. ఎన్నో ప్రత్యేకతల సంగమం..ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నిలయం. చారిత్రక ప్రదేశాలు, విశిష్ట వ్యక్తులు, వింతలు, విశేషాలకు పుట్టినిల్లు. కళాకారులు, కర్రతో నగల తయారీదారులకు కొలువైన ప్రాంతం. సాముగరిడీలలో ఆరితేరిన వారు. సాగునీటి వనరులు.. ఇలా ఎన్నో విశేషాల సమాహారం.

ఎన్నో ప్రత్యేకతలు

ఈ నియోజకవర్గంలోని విశేషాలను పరిశీలిస్తే....కాశీ తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న త్రివేణి సంగమం వంగర మండలం సంగాం గ్రామ పరిసరాల్లో ఉంది. నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు ఇక్కడే కలుస్తాయి. త్రివేణి సంగమంలో స్నానం చేసి.. శివాలయంలో పూజలు చేస్తే కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నంత ఫలితమని ప్రజల నమ్మకం.

- ఈ మండలం మడ్డువలస ప్రాజెక్టును ఆనుకొని ఉన్న కొండపై పాండవుల పంచ ఉంది. వనవాసం సమయంలో ఇక్కడే పాండవులు ఉన్నారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.



సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురంలో ఐదు దశాబ్దాల కిందట బొబ్బిలి రాజులు నిర్మించిన సీతారామస్వామి ఆలయం



ఒకప్పటి పోలీసు స్టేషన్

- సంతకవిటి మండలం గుళ్ల సీతారాంపురంలో సీతారామాలయం ప్రసిద్ధికెక్కింది. అయిదు శతాబ్దాల క్రితం బొబ్బిలి రాజులు నిర్మించిన ఈ ఆలయంలో ఏకశిలపై చెక్కిన సీత, రాముడు, ఆంజనేయుడి విగ్రహం 15వ శతాబ్దం నాటి శిల్పుల పనితనానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇక్కడి శిల్పకళా సంపద సందర్శకులను పరవశింపజేస్తుంది.
- ఇదే మండలం సిరిపురం గ్రామంలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తామరచెరువు జిల్లాలోనే అతి పెద్దది.
- రాజాం పట్టణంలోని నవదుర్గ అమ్మవారి ఆలయం దేశంలోనే ఏకైక ఆలయం. తొమ్మిది మంది దుర్గలతో కూడిన ఆలయం దేశంలో మరెక్కడా లేదు.
- ఇక్కడే వెలిసిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా వెలుగొందుతోంది. ఈ మండలం రాజయ్యపేటలోని వరదరాజ స్వామి ఆలయం వందల ఏళ్ల క్రితం నిర్మించారు.

విశిష్ట వ్యక్తులు ఇక్కడివారే..

- ప్రపంచ పారిశ్రామిక చిత్రపటంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గ్రంధి మల్లికార్జునరావుది (జీఎంఆర్.) రాజాం.
- బీహార్ ఎన్నికలలో సంచలనాలకు మారుపేరుగా నిలిచిన కేంద్ర ఎన్నికల మాజీ సలహాదారు కేజే రావు స్వగ్రామం రేగిడి మండలం కొండల మామిడివలస.
- హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన దివంగత కొత్తపల్లి పున్నయ్యది సంతకవిటి మండలం కావలి గ్రామం.
- ప్రత్యేకమైన చెక్కతో ఆభరణాలు తయారుచేసే నిపుణులు మండలం పనసలవలసలో ఉండేవారు. పౌరాణిక నాటకాలలో నటులు వీటిని వేసుకునేవారు. రోల్డ్‌గోల్డ్ ఆభరణాల ప్రాముఖ్యం పెరగడంతో వృత్తికి వీరు దూరమయ్యారు.
- తానీషా ఆస్థానంలో మంత్రులుగా పనిచేసిన అక్కన్న, మాదన్న పేర్లతో రేగిడి మండలంలో అక్కన్న అగ్రహారం, మాధవ రాయపురం గ్రామాలు ఉన్నాయి.



వంగర మండలం సంగాం గ్రామంలో గల సంగమేశ్వర స్వామి ఆలయం

చారిత్రకంగా..


- బొబ్బిలి రాజుల హయాంలో ఇక్కడి రాణావీధిలో నిర్మించిన భవనంలో తాండ్ర పాపారాయుడు ఉండేవారు. ఇదే భవనంలో ప్రత్యేకంగా జైలుగది కూడా ఉంది. పాపారాయుడు మెడలో ధరించే ఆభరణం ఇప్పటికీ భద్రంగా ఉంది.
- బొబ్బిలి రాజులు నివాసం ఉండే కోటలో కోర్టుల సముదాయం ఉండేది. ఈ భవనాలన్నీ ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి.
- బొబ్బిలి రాజుల హయాంలోని నిర్మాణాల శిథిలాల ఆనవాళ్లు ఇప్పటికీ రేగిడి మండలం ఉంగరాడ, సంతకవిటి మండలం వావిలవలస, జీఎస్ పురం గ్రామాల్లో ఉన్నాయి.
- జమిందారీ పోరాటానికి ఊపిరిపోసిన సింహాద్రి సూర్యనారాయణ, అప్పన్న సోదరులది రేగిడి మండలం ఆడవరం గ్రామం.
- రాజాం నుంచి చీపురుపల్లి వెళ్లే మార్గంలో ఉన్న జెండాల దిబ్బ ప్రాంతానికి కూడా చారిత్రక నేపథ్యం ఉంది. విజయనగరం, బొబ్బిలి రాజులు యుద్ధ సమయంలో ఇక్కడ రెండు రాజ్యాల జెండాలు పాతారని... అందుకే ఈ ప్రాంతానికి జెండాల దిబ్బగా పేరు వచ్చిందని చెబుతారు.



తాండ్ర పాపారాయుడు



అప్పట్లో బొబ్బిలి రాజుల విశ్రాంతి భవనం



నెల్లిమర్ల జూట్ మిల్లు

కార్మికులే కీలకం

- శ్రమజీవుల ఓట్ల కోసం పార్టీల యత్నాలు
- ఇదీ నెల్లిమర్ల నియోజకవర్గం పరిస్థితి

నెల్లిమర్ల: నెల్లిమర్ల పేరు చెబితే ప్రధానంగా గుర్తుకు వచ్చేది కార్మిక లోకం. ఎన్నికల ఫలితాల్లో వీరి ఓట్లే కీలకం. ఈ నియోజక వర్గంలో రైతులు అధికంగా ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో కార్మికులు ఉంటారు. నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలో వంద సంవత్సరాల చరిత్ర కలిగిన నెల్లిమర్ల జూట్ మిల్లు ఉంది. దీనిపై ఆధార పడి సుమారు 12 గ్రామాలకు చెందిన 5 వేల కుటుంబాల వారు ఉన్నారు. వీరి కుటుంబాల్లో సుమారు 30 వేలకు పైగా ఓట్లు ఉన్నాయి. అలాగే పూసపాటిరేగ మండల పరిధిలోని ఫార్మా కంపెనీల్లో వేలాది మంది కార్మికులు ఉన్నారు. ఈ ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న వారిలో నెల్లిమర్ల మండలం శివారు గ్రామాల వారితో పాటు పూసపాటిరేగ, డెంకాడ మండలాల వారు కూడా ఉన్నారు. వీరంతా మరో 40 వేల మంది వరకు ఉన్నారు. నియోజక వర్గంలో సుమారు 2 లక్షల 13 వేల ఓట్లుగా ఉండగా వీరిలో కార్మికులు దాదాపు 70 వేల మంది వరకు ఉన్నారు. వీరి ఓట్లను ఆకట్టుకునేందుకు ఇటు అధికార వైసీపీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడుతో పాటు, కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు కాకుండా... మిగిలిన వారంతా విద్యావంతులైన ఉద్యోగులే. నిజానికి వీరంతా తటస్థులనే చెప్పాలి. వీరి ఓట్లకు కూడా గాలం వేసేందుకు వారు నివసిస్తున్న ప్రాంతాల్లో వివిధ పార్టీల నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.



ర్యాలీగా వెళ్తున్న జూట్ కార్మికులు (ఫైల్)

ఓటు దారిలో...

- విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదుపాయం
- పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్‌చైర్ల సౌకర్యం
- బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపర్

కలెక్టరేట్, మే 3: ఈ సార్వత్రిక ఎన్నికలలో విభిన్న ప్రతిభావంతులు ఓటు వేయడానికి జిల్లా యంత్రాగం ప్రత్యేక సదుపాయం కల్పిస్తోంది. శతశాతం ఓటింగ్ నమోదు చేయాలనే లక్ష్యంతో కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వృద్ధులు, దివ్యాంగులు అందరూ ఓటు వేసే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. వారు పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు అనువైన వాతావరణం, వసతులు కల్పించే చర్యలు చేపట్టారు. జిల్లాలోని 1,847 పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేశారు. అలాగే వీల్‌ఛైర్లు, త్రిచక్ర వాహనాల సౌకర్యం కల్పిస్తున్నారు. నడవలేని వారిని పోలింగ్ కేంద్రంలోకి చేర్చేందుకు జిల్లా వ్యాప్తంగా 716 వీల్‌ఛైర్లు సిద్ధం చేశారు.

ఎక్కడెక్కడంటే...

రాజాం నియోజకవర్గంలో 114, బొబ్బిలిలో 113, చీపురుపల్లిలో 138, గజపతినగరంలో 76, నెల్లిమర్లలో 56, విజయనగరంలో 76, ఎస్.కోటలో 87, మెంటాడ మండలంలో 26 వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఎస్కార్ట్‌ల సహకారంతో వీల్‌ఛైర్ల ద్వారా దివ్యాంగులు, వయోవృద్ధులు పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు జిల్లాలో 35 వేల ఓటరు గైడ్‌లు ముద్రించారు. వీటిని వృద్ధులు, దివ్యాంగులకు అందజేస్తున్నారు.

అంధుల కోసం 4,865 ఓటర్లు స్లిప్పులు

అంధుల కోసం బ్రెయిలీ లిపిలో ప్రత్యేకంగా ఓటర్ స్లిప్పులు, పోస్టర్లను ముద్రిస్తున్నారు. తమ ఓటు వివరాలను తెలుసుకొనేందుకు అంధులకు బ్రెయిలీ లిపిలో సుమారు 4,865 ఓటరు స్లిప్పులను ముద్రించి అందజేయనున్నారు. బ్రెయిలీలో పోస్టర్లను ముద్రించి... అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచుతారు. ఈవీఎంలపై బ్రెయిలీ లిపిలో అభ్యర్థుల వరుస నెంబర్లను తెలియజేసే సదుపాయం ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చింది.

సాక్ష్యం యాప్

దివ్యాంగులకు సాయం కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సాక్ష్యం యాప్‌ను రూపొందించింది. ఓటరుగా నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకోవడం, వీల్ చైర్ రవాణా, అంధులకు వాయిస్ ద్వారా సహకరించడం, వినికిడి లోపం ఉన్న వారికి టెక్స్ట్ టు స్పీచ్ తదితర సహాయ సహకారాలను ఈ యాప్ ద్వారా విభిన్న ప్రతిభావంతులు పొందవచ్చు.



సిద్ధం చేసిన వీల్ చైర్లు




పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపు

మోడల్ పోలింగ్ స్టేషన్లు

దివ్యాంగులకు ఓటు వేసే విధానం పట్ల మరింత అవగాహన కల్పించేందుకు... వారిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు జిల్లాలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరంలోని కొత్త అగ్రహారం, నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ మండలం పూతికపేట పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు.

హోమ్ ఓటింగ్‌కు అవకాశం

పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి అవకాశం లేని 85 ఏళ్ల పైబడిన వృద్ధులు... 40 శాతం వైకల్యం దాటిన విభిన్న ప్రతిభావంతులు తమ ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఈ ఏడాది కొత్తగా అందుబాటులోకి తీసుకుని వచ్చింది. జిల్లాలో సుమారు 21,993 మంది విభిన్న ప్రతిభావంతులు, సుమారు 7,181 మంది 85 ఏళ్ల పైబడిన వృద్ధులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవడానికి 86 మంది దివ్యాంగులు, 156 మంది వృద్ధులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ మధ్య అధికారులు వీరి ఇళ్లకు వెళ్లి ఓటు తీసుకుంటారు.



చీపురుపల్లి నియోజకవర్గం మ్యాప్

విజయనగరం జిల్లాలో చీపురుపల్లి నియోజక వర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఎక్కువ కాలం ఇతర ప్రాంతాల నాయకులే కీలక పదవులు చేపట్టారు. అత్యధికంగా మెరకముడిదాం మండలానికి చెందిన వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

మెరకముడిదాం మొనగాళ్లు

- 13 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు అక్కడి వారే
- చీపురుపల్లి నాయకులకు రెండుసార్లే ఛాన్స్

(చీపురుపల్లి)

చీపురుపల్లి నియోజకవర్గ రాజకీయాల్లో ఎక్కువ కాలం స్థానికేతరులే చక్రం తిప్పారు. రాజకీయ చైతన్యం ఉన్న ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారిలో ముఖ్యంగా మెరకముడిదాం నాయకులు మొదటి స్థానంలో నిలవగా... శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాయకులు రెండో స్థానంలో నిలిచారు. ఇప్పటి వరకూ ఎన్నికైన 13 మంది సభ్యుల్లో ఐదుగురు మెరకముడిదాం మండలానికి చెందిన వారు. ముగ్గురు శ్రీకాకుళం జిల్లా వాసులకు అవకాశం దక్కింది. ఒకరు విజయనగరం నుంచి వచ్చి గెలవగా... కేవలం ఇద్దరు మాత్రమే చీపురుపల్లిలో స్థిర నివాసం ఏర్పరచుకొని...ఇక్కడి సీటును కైవసం చేసుకోగలిగారు.

అలా మొదలైంది

1952లో చీపురుపల్లి నియోజకవర్గం ఏర్పాటయ్యే నాటికి చీపురుపల్లి, మెరకముడిదాం, జి.సిగడాం, పొందూరు మండలాలు ఈ నియోజకవర్గంలో విలీనమై ఉండేవి. ఆ సమయంలో ఈ అసెంబ్లీ సీటుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం మెరకముడిదాం మండలానికి చెందిన నాయకులకే దక్కింది. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో మెరకముడిదాం మండలం గర్భాం గ్రామానికి చెందిన తాడ్డె చిన అచ్చిన్నాయుడు గెలుపొంది.. చీపురుపల్లి రాజకీయాల్లో స్థానికేతరుల హవాకు పునాదులు వేశారు. అనంతరం 1955లో జరిగిన ఎన్నికల్లో మెరకముడిదాం గ్రామానికి చెందిన ముదుండి సత్యనారాయణరాజు, 1962లో అదే మండలంలో చినబంటుపల్లికి చెందిన కోట్ల సన్యాసప్పలనాయుడు, 1967లో గర్భాంకు చెందిన తాడ్డె రామారావు, 1972లో ఇప్పలవలసకు చెందిన రౌతు పైడపునాయుడులు వరుసగా విజయం సాధించారు. రెండు దశాబ్దాల పాటు మెరకముడిదాం హవాకు ఎదురు లేదనిపించారు. ఆ తరువాత నియోజకవర్గాల పునర్విభజనలో మెరకముడిదాం మండలం తెర్లాం నియోజకవర్గంలో విలీనమైంది. కొత్తగా శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు మండలాలు చీపురుపల్లిలో చేరాయి. అక్కడి నుంచి శ్రీకాకుళం నాయకుల హవా ప్రారంభమైంది.



చీపురుపల్లి పట్టణం

వీరు ఇలా...

1978లో జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళానికి చెందిన చిగిలిపల్లి శ్యామలరావు, 1983లో త్రిపురాన వెంకటరత్నం, 1989లో జి.సిగడాం మండలం టంకాల దుగ్గివలస గ్రామానికి చెందిన టంకాల సరస్వతమ్మలు గెలుపొందారు. 2004, 2009 సంవత్సరాల్లో విజయనగరానికి చెందిన బొత్స సత్యనారాయణ గెలిచారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా శ్రీకాకుళం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలానికి చెందిన కిమిడి మృణాళిని విజయం సాధించారు. ఇక్కడే నివాసం ఉంటూ ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారిలో కెంబూరి రామ్మోహనరావు, గద్దే బాబూరావులు మాత్రమే ఉన్నారు. వీరిలో కెంబూరి రామ్మోహనరావు సొంత గ్రామం పుర్లి అయినప్పటికీ... తాత, తండ్రుల కాలం నుంచి చీపురుపల్లిలో స్థిరపడిపోవడంతో ఇక్కడి నాయకుడిగానే గుర్తింపు పొందారు. అదే విధంగా గద్దే బాబూరావు సుమారు నాలుగు దశాబ్దాల కిందట కృష్ణా జిల్లా నుంచి వలస వచ్చినప్పటికీ... పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకొని ఇక్కడే ఉండిపోవడంతో స్థానికుడయ్యారు.



తాడ్డె చిన అచ్చిన్నాయుడు



తాడ్డె రామారావు



కోట్ల సన్యాసప్పలనాయుడు

ఆలే ఈలు.. ఈలే ఆలు!

- అవేన్రా ఎలచ్చన్ నెక్కలు

(చీపురుపల్లి)

ఎన్నికల ప్రచారం ముమ్మురంగా సాగుతోంది. ఓ పల్లెటూరిలో అంతకు రెండు రోజుల కిందట రెండు ప్రధాన పార్టీలు బహిరంగ సభ నిర్వహించాయి. అప్పటి నుంచీ గ్రామంలోని రచ్చబండ వద్ద విశ్లేషణలు సాగుతూనే ఉన్నాయి. సభ జరిగిన తీరుపై రకరకాల వ్యాఖ్యానాలు, విమర్శలు, ప్రతి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ఓ రోజు సాయంత్రం ఇద్దరు వ్యక్తుల మధ్య రసవత్తర చర్చ జరుగుతోందిలా..

ఎంకడు: అవున్రా.. కిష్టా! నీవు ఏడో క్యాసు సదివినావు కదా.. నిన్నట్నుండి నీకొకటడుగుదావనుంద్రా..

కిష్ట: ఏట్రా అది?

ఎంకడు: మొన్న బుదారం సాయంకాలం మనూల్లో మీటింగెట్నారా పచ్చ పారిటీవోల్లు. ఆ మీటింగికట ఎయ్యి మందొచ్చినారని అన్నార్రా...

కిష్ట: అన్నీరా... అంతే నీకేటి?

ఎంకడు: ఓరది కాదురా.. అ మర్నాడు తెల్ల పారిటీ కూడా ఎట్నాది కదారా మీటింగు..

కిష్ట: అవును.

ఎంకడు: అదేన్రా.. అలు కూడా అన్నార్రా... పన్నిండొందల మంది వొచ్చినారని..


కిష్ట: అవున్రా.. అయితే నీకేట్రా బాద?

ఎంకడు: ఓరి బాద కాదురా.. మనూరు జెనాబా ఎంతరా?

కిష్ట: కిందటేడాదికి పిల్లా పిచ్చుకా కలిపి పదమూడొందల్రా..

ఎంకడు: అదుగో.. అద్గదే మరి.. ఆలకి ఎయ్యిమంది...ఈలకి పన్నిండొందల మంది కలిపితే.. రెండేలు దాటిపోనాదా..? ఇంత మందెక్కణ్ణించొచ్చినార్రా బాబూ?

కిష్ట: ఓరి ఎర్రిమాలోకవా.. అదేట్రా నీ డౌటు.. ఆలే ఈలు. ఈలే ఆలు.. అవేన్రా ఎలచ్చన్ నెక్కలు. ఎక్కువ ఆలోసించి బుర్ర పాడెట్టుకోకు. అల్లదో... మాయప్ప పిలత్తంది. సీకటొడిపోనాది. ఇంటికెల్లి నాలుగు మెతుకులు తిను.



11వ తేదీకి పోలింగ్ కేంద్రాలు సిద్ధం

- ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

కలెక్టరేట్, మే 3: ఈ నెల 11వ తేదీకే పోలింగ్ కేంద్రాలను అన్ని వసతులతో సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, నేమ్ బోర్డులతో సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీవోలు, తహసీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12న ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని... అందువల్ల 11వ తేదీ నాటికే ఏర్పాట్లు పూర్తి కావాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఆరు మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సిబ్బందికి, ఓటర్లకు సరిపడేలా తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని గదుల్లో తగినంత లైటింగ్ ఉండాలని, బాత్ రూమ్‌లలో కూడా లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు ఎండకు ఇబ్బంది పడకుండా నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లకు అందుబాటులో తాగునీరు ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బందికి నాణ్యమైన ఆహారం, పానీయాలు అందించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటికే ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు (ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నవారు) తమ ఓటు హక్కును ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఓటు వేయవచ్చుని సూచించారు.

పోలింగ్‌ను బహిష్కరిస్తే రీపోలింగ్ ఉండదు

(విజయనగరం)

ఏ కారణం చేతనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమయితే పోలింగ్ సమయాన్ని పెంచరు. నిర్దీత సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రయినా సరే వారంతా ఓటు వేసే వరకూ పోలింగ్ కొనసాగుతుంది. ఎక్కడైనా పోలింగ్‌ను బహిష్కరిస్తే రీ పోలింగ్ ఉండదు. పోలింగ్ కేంద్రంలో గానీ, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో గానీ అభ్యర్థితో పాటు ఏ వ్యక్తి కూడా ఫలానా గుర్తు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయడం శిక్షార్హం. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951, సెక్షన్ 130 ప్రకారం నేరం. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏవైనా కారణాలతో ఓటింగ్‌ను బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రం పరిధిలోగానీ, 100 మీటర్ల దూరంలో గానీ అభ్యర్థి మీడియాతో మాట్లాడకూడదు. అది చట్టరీత్యా నేరం. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి గన్‌మెన్‌కు అనుమతి లేదు. ఒక వేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన ఆయుధాన్ని బయట ఉన్న పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తన ఆయుధాన్ని తీసుకోవాలి. ఓటు వేసే సమయంలో ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం. ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.

ఎట్లయినను.. వెదికి పట్టుకోవలె!



- ఓటరు జాబితాల్లో పేర్లున్నా.. జాడ లేని వైనం
- వలస ఓటర్ల ఆచూకీ కోసం నేతల అగచాట్లు
- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

(విజయనగరం)

విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. పోటీలో ఉన్న వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఎన్నికల వ్యూహ రచనలో తలమునకలవుతున్నారు. పోటీ రసవత్తరంగా మారుతుండడంతో అభ్యర్థులు, వారి అనుచరులు గెలుపునకు ఉండే అన్నిమార్గాలూ అన్వేషిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా మెజార్టీ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో వలస ఓటర్లపై అభ్యర్థులు దృష్టి సారించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మాత్రమే వలస ఓటర్లను స్వస్థలాలకు రప్పించి ఓట్లు వేయించేవారు. ప్రస్తుతం పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లను ఎలాగైనా తెప్పించి ఓటు వినియోగించేకునేలా చూడాలని చర్యలు ప్రారంభించారు.



అభ్యర్థుల అగచాట్లు

ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నా, స్థానికంగా వారు కనిపించకపోవడంతో ఎక్కడ ఉంటారో, ఎలా వారిని పోలింగ్ బూత్‌కు రప్పించాలోనని ఆందోళన చెందుతున్నారు. వారి ఆచూకీ కోసం ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు అగచాట్లు పడుతున్నారు. పార్టీల్లోని వార్డు ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్ల ద్వారా పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. జాబితాలో ఉన్న ఓటర్లు స్థానికంగా ఎంతమంది ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఉన్నారు. వారిని ఎలా రప్పించాలి.. తదితర అంశాలపై దృష్టిపెట్టారు. పట్టణాల్లో ఒక్కో వార్డులో 50 నుంచి 100 మంది వరకు వలస ఓటర్లు ఉండగా, పల్లెల్లో వర్షాభావం వల్ల ఈ ఏడాది వేల సంఖ్యలో వలసవెళ్లారు. గతంలో బీఎల్వోలు ఇంటింటా తిరిగి ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడ వారి ఓట్లను చేర్చాలని అధికారులు కోరినా కొందరు పట్టణాల్లో అమలు చేయలేదు. ప్రస్తుతం అటువంటి ఓటర్లకు బీఎల్వోలు స్లిప్పులు ఎలా ఇస్తారో అంతుపట్టడం లేదు. ఈ నేపథ్యంలో వలస ఓటర్ల స్థానంలో పట్టణ ప్రాంతాల్లో దొంగ ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి వలస వెళ్లిన వారి ముఖాలు పోలింగ్ ఏజెంట్లకు తెలియకపోవడం... పట్టణ ప్రాంతాల్లో పరిచయాలు పెద్దగా లేకపోవడం తదితర కారణాల వల్ల ఒకరి ఓటు మరొకరు వేసే అవకాశం ఉంటుంది.

రప్పించేందుకు ప్రయత్నాలు

ఇతర రాష్ట్రాలు, పట్టణాల్లో ఉన్న వలస ఓటర్ల ను రప్పించేందుకు గ్రామాల్లో రాజకీయ నాయకులు ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలెట్టారు. ఇందుకోసం గ్రామాల నేతలను పార్టీ కార్యాలయాలకు రప్పించి ఓటర్ల జాబితాల్లో ఉన్న వలస ఓటర్లను గుర్తిస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లను రప్పించేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. వారికి వీలైతే బస్సులు ఏర్పాటు చేయడం కానీ... లేదా ఫోన్లు చేసి ఫోన్‌పే ద్వారా రానూ పోనూ ఖర్చులకు డబ్బులు పంపించి రప్పించేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు.

ఖర్చుకు వెనుకాడని వైనం

శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ప్రధాన పార్టీల నుంచి తొలిసారి చట్టసభల్లోకి వెళ్లాలని ఉవ్విళ్లూరుతున్నారు. వీరంతా వ్యయానికి సైతం వెనకడుగు వేయడంలేదు. దీంతో తక్కువ సమయం ఉన్నా తమకు ఖచ్చితంగా పడతాయని భావించి వలస ఓటర్లను రప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాభావం వల్ల వ్యవసాయ కాలం తర్వాత వేలాది మంది చెన్నై, ముంబై తదితర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్తుంటారు. ప్రతి ఎన్నికల్లో నాలుగు వేలమంది వరకూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తుంటారని అంచనా. దేశంలోని వివిధ ప్రాంతలతోపాటు సౌదీఅరేబియా తదితర ప్రాంతాల్లో ఉపాధి కోసం వందల సంఖ్యలో వలస వెళ్లి ఉంటారని వివిధ గ్రామాల పెద్దలు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వలస ఓట్లకు ప్రాధాన్యం ఏర్పడింది.



హత్యాయత్నం కేసు నమోదు

మక్కువ: ఓ యువకుడిపై దాడిచేసి, పరారైన ముగ్గురు వ్యక్తులను స్థానిక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ మేరకు వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.నరసింహమూర్తి శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండల కేంద్రంలోని కూరాకుల వీధికి చెందిన కోట రామకృష్ణపై ఈనెల 1న బుధవారం కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన రామకృష్ణ స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో రామకృష్ణపై దాడి చేసిన మక్కువకు చెందిన బర్రి హరి, బర్రి లక్ష్మణరావు, పువ్వల సూర్యనారాయణలను శుక్రవారం స్థానిక చర్చి సెంటర్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. వారిని 307 సెక్షన్ కింద అరెస్టు చేసి, సాలూరు జ్యూడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం బొబ్బిలి సబ్‌జైలుకు తరలించారు.

అలమండ సచివాలయానికి తాళం

జియ్యమ్మవలస: అలమండ సచివాలయానికి తాళం పడింది. నాలుగేళ్లగా సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యాన్ని చూసి ఓర్వలేని సర్పంచ్ ఊయక చంటి శుక్రవారం కార్యాలయానికి తాళం వేశారు. ఈసందర్భంగా సర్పంచ్ చంటి మాట్లాడుతూ అలమండ సచివాలయంలో మొత్తం 11 మంది సిబ్బంది ఉన్నారని, వీరిలో ఐదుగురే సమయానికి హాజరవుతున్నారని తెలిపారు. మిగిలిన వారు వారికి ఇష్టం వచ్చినట్లు నచ్చిన సమయానికి వచ్చి వెళ్లిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయం వారికి పలుమార్లు చెప్పినా పరిస్థితి మారలేదు సరికదా, చెప్పిన తర్వాత నుంచి వారి పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యిందన్నారు. దీంతో చివరికి సచివాలయానికి తాళం వేయక తప్పలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.



సచివాలయానికి తాళం వేస్తున్న సర్పంచ్ చంటి

ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: భారత ఎన్నికల కమిషన్ శుక్రవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. జిల్లాల్లో ఎన్నికల నిర్వహణపై అధికారులకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం మన్యం కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్‌కుమార్ మెహర్డ, పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసుల పరిశీలకులు నయీం ముస్తఫా మన్సూరి, నాలుగు శాసనసభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రమకాంత్ ప్రధాన్, పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు గుర్‌కరుణ్‌సింగ్, శాసనసభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ పాల్గొన్నారు.

పశు సంపదపై ప్రత్యేక దృష్టి సారించాలి

సీతానగరం: పశు సంపదపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి ఎస్.మన్మథరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పశు వైద్య కేంద్రంలో సీతానగరం, బలిజిపేట మండలాల పశు వైద్యాధికారులు, పశువైద్య సచివాలయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా పశు సంపదపై రైతులు దృష్టి సారించేలా వారిని అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డా.ప్రసాదరావు, ఏడీలు డా.నీలయ్య, డా.చింతాడ దీనకుమార్, సీతానగరం, బలిజిపేట పశువైద్యులు ఎస్.రామారావు, గణేష్, వివిధ సచివాలయ పశువైద్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

పాలకొండ: నగర పంచాయతీలోని ఏడో వార్డు నాలుగో లైన్ నివాస ప్రజలు విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాత్రి సమయంలో పది గంటల తర్వాత విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. గత పది రోజులుగా ఇదే పరిస్థితి ఉందని, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారన్నారు. వేసవి తాపంతో పగలు అల్లాడుతుంటే రాత్రి సమయంలో విద్యుత్ కోతతో మరింత ఇబ్బంది పడుతున్నారని ఆయన చెప్పారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మస్తర్లలో తేడా వస్తే చర్యలు

● ఉపాధి ఏపీవో ఈశ్వరమ్మ

మక్కువ: మస్తర్లలో తేడా వస్తే చర్యలు తప్పవని ఉపాధి హామీ ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ అన్నారు. గుంటభద్ర గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారులు పనివేళలు సక్రమంగా పాటించాలన్నారు. ఎండల తీవ్రతకు పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీవో ఈశ్వరమ్మ

అతుల్‌కుమార్‌కు శ్రద్ధాంజలి

పాలకొండ: రైతు బాంధవుడు అతుల్‌కుమార్‌కు మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం శ్రద్ధాంజలి నిర్వహించారు. ఏపీ రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన డాక్టర్ స్వామినాథన్ కమిటీలో అతుల్‌కుమార్ మెంబర్‌గా ఉన్నారని, ఢిల్లీ నడిబొడ్డున 13నెలలపాటు జరిగిన రైతుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. శుక్రవారం ఉదయం లక్నోలో క్యాన్సర్ ఆసుపత్రిలో మృతిచెందడం బాధాకరమన్నారు.



అతుల్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఆదమరిస్తే అంతే సంగతి

● రహదారి పక్కన ప్రమాదకరంగా గొయ్యి

బలిజిపేట: మండలంలోని నారంనాయుడువలస గ్రామ నుంచి గలావిల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. వాహనచోదకులు ఆదమరిచి ప్రయాణిస్తే అంతే సంగతి.. బోల్తా కొట్టాల్సిందే. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే వాహనాలు ఈ గోతిలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ రహదారి గుండా చాలామంది అధికారులు ప్రయాణిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదం జరిగితే తప్పా పట్టించుకోరేమో అని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గోతులమయంగా..

నారంనాయుడువలస గ్రామ నుంచి గలావిల్లి గ్రామానికి వెళ్లే ఈ రహదారి అంతా గోతులమయంగా ఉంది. ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని, రహదారి పక్కన ఏర్పడిన గొయ్యిని పూడ్చాలని ఆయా గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.



రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కాంగ్రెస్ విజయం తథ్యం: మల్లు భట్టివిక్రమార్క

రాయగడ: ఈ సారి ఎన్నికల్లో ఒడిశాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారానికి వచ్చిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐఏసీఆర్ కళాశాల సమీపంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లోకసభ, శాసనసభలకు పోటీచేస్తున్న అభ్యర్థులు సప్తగిరి ఉలకా, అప్పలస్వామి కద్రకలను సభకు పరిచయం చేశారు. ఈ రోజే రాహుల్ గాంధీ నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లడంతో ఇక్కడకు రాలేకపోయారని, తన సందేశాన్ని ఇవ్వమని తెలిపారని రాహుల్ సందేశాన్ని సభలో వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సప్తగిరి ఉలక మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్‌పట్నాయక్, పూర్వ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగ్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా, సంకర్షణ్ మంగరాజ్ పాల్గొన్నారు.



వేదికపై విక్రమార్క, శరత్‌పట్నాయక్, ఉలకా

ఒడిశా

వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలి: జగదీశ్వరి

గరుగుబిల్లి: ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మండలంలోని కొంకడివరం, సీతారాంపురం, సుంకి, కేఆర్ఎన్ వలస, ఉద్దవోలు, గరుగుబిల్లి, పెద్దూరుతో పాటు పలు గ్రామాల్లో ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిని, చెల్లిని ఆదరించని జగన్ ప్రజలను ఎలా ఆదరిస్తారో ప్రజలు ఆలోచించాలన్నారు. పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, అంబటి తవిటినాయుడు, కోట భరత్‌కుమార్, ముదిలిబాబు విజయవాంకుశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి

టీడీపీలో చేరిక

కొమరాడ: చినఖేర్డిల ఎంపీటీసీ మండంగి వసంత, నయ సర్పంచ్ ఊయక పార్వతి శుక్రవారం టీడీపీ నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు ఒప్పంగి లావణ్యలత ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మాదలంగిలో టీడీపీ మండల కన్వీనర్ ఎస్.ఉదయశేఖర్‌పాత్రుడు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పాల్గొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లను పార్టీలోకి ఆహ్వానించారు. వివిధ గ్రామాలకు చెందిన 100 కుటుంబాలను ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. సుదర్శనరావు, మధుసూదనరావు, పి.వెంకటనాయుడు, డి.వెంకట నాయుడు, తమ్మయ్య, చినకేర్డిల సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

జగదీశ్వరిని గెలిపించాలి

కురుపాం: కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరిని సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ కోరారు. కురుపాంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కోలా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం ప్రచారం చేశారు. గ్రామంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జీవీ రమణమూర్తి, చందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రదేవ్‌కు స్వాగతం పలుకుతున్న యువత

వైసీపీని గద్దె దింపాలి: సంధ్యారాణి

పాచిపెంట: ప్రతిఒక్కరూ ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పి గద్దె దింపాలని కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. మండలంలోని తోటవలస, కొటికిపెంట, కేసలి, గొర్లెవలస, బడ్నాయికవలస, కర్రివలస, అమ్మవలస గ్రామాల్లో ఆమె శుక్రవారం ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. ● ప్రచారంలో భాగంగా కొటికిపెంట గ్రామంలో వైసీపీకి చెందిన 200 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో వారికి సంధ్యారాణి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తల పోలినాయుడు, ముఖి సూర్యనారాయణ దండి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

ఒక్క అవకాశం ఇవ్వండి: జయకృష్ణ

సీతంపేట: ఒక్క అవకాశం ఇవ్వండి.. పాలకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కోరారు. మండలంలోని కొత్తడి, మధ్యతొత్తడి, కిండంగి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు నిమ్మక చంద్రశేఖర్, సవర గంగయ్య, కుండంగి శ్రీకాంత్, ఉపేంద్ర, పాలక ఆదినారాయణ, లక్ష్మణరావు, నిమ్మక కాంతారావు, సవర కృష్ణ, నిమ్మక కృష్ణ, నిమ్మక రోజా, దమయంతి తదితరులున్నారు. అలాగే అంటికొండ, అచ్చెబ గ్రామాల్లో జయకృష్ణకు మద్దతుగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి ఇంటింటా ప్రచారం చేశారు. గ్లాసు గుర్తుకు ఓటువేసి జయకృష్ణను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని వీరఘట్టం మేజర్ పంచాయతీలో శుక్రవారం టీడీపీ, జనసేన కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి నిమ్మక జయకృష్ణను, కమలం గుర్తుపై ఓటు వేసి కొత్తపల్లి గీతను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరి, మహేష్, ప్రవీణ్ తదితరులున్నారు. ● **పాలకొండ:** నగర పంచాయతీలోని గారమ్మకాలనీలో ఎరుకుల వీధికి చెందిన సుమారు 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వీరంతా పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంపోలు శ్రీనివాసరావు, సుంకరి అనీల్‌దత్, శాసపు రాంబాబు, దుప్పాడ వెంకటరమణ, ఉదయాన చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: ప్రచారంలో పాల్గొన్న జయకృష్ణ

చంద్రబాబు సీఎం కావడం అవసరం

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని కొత్తవలసకు చెందిన దేవకోటి శంకరరావు తన అనుచరులతో శుక్రవారం టీడీపీలో చేరారు. వారిని విజయచంద్ర పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గం వైసీపీ ప్రభుత్వ కాలంలో కనీస అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించలేదని, రహదారులకు కనీసం మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. డంపింగ్ యార్డును తరలిస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గ ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అరకు ఎంపీ అభ్యర్థినిగా ఎన్‌డీఏ కూటమి నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థిని కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి వెంకటేష్, కోలా మధుసూదన్‌రావు, బడే గౌరునాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **బలిజిపేట:** మండలంలోని తుమరాడ, వెంగాపురం, నారాయణపురం, బలిజిపేట, పలగర గ్రామాల్లో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పి.వేణునాయుడు, అరకు బీసీ సెల్ అధ్యక్షుడు బూరాడ రామ్మోహన్‌రావు, అజ్జాడ సర్పంచ్ అక్కినేని జగన్‌మోహనరావు, నారనాయుడువలస సర్పంచ్ సి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న విజయచంద్ర

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు



వీరఘట్టం: కంబరలో మాట్లాడుతున్న ఎస్ఐ ఫక్రుద్దీన్



సీతానగరం: ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న దృశ్యం

వీరఘట్టం: ఎన్నికల సమయంలో ఎటువంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్కే ఫక్రుద్దీన్ హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన కంబరలో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎటువంటి తగాదాలకు పోవద్దని సూచించారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

సీతానగరం: మండలంలోని అంటి పేట, చినబోగిల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భద్రతా బలగాల ఆధ్వర్యంలో పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ గ్రామంలో రెండోసారి కవాతు నిర్వహించారు. సాలూరు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు

సాలూరు రూరల్: ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది అని, కుల, మత శక్తుల ప్రాబల్యం పట్ల ఓటర్లు జాగ్రత్తగా ఉండాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ బంకురు జోగినాయుడు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం సాలూరులో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా ఓటు వేసి, నచ్చిన ప్రతినిధులను లోక్‌సభ, అసెంబ్లీకు పంపించాలని ఆయన కోరారు.

సరిహద్దులో తనిఖీలు

పాచిపెంట: త్వరలో జరగబోయే ఎన్నికల దృష్ట్యా మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దుగల పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.కాసురామ్‌నాయక్, ఎస్ఎస్ టీం హెడ్ కానిస్టేబుల్ పి.లావణ్య, ఎస్ఐ బి.కుమార్‌బాబు, సిబ్బంది విధులు నిర్వహించారు. ఒడిశా నుంచి వచ్చి పోయే వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లు, బస్సులను తనిఖీలు చేస్తున్నారు.



పాచిపెంట: పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఓటరు స్లిప్పుల పంపిణీ

పాలకొండ: పాలకొండ రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు వీఆర్వోలు ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం నగర పంచాయతీలోని పీఎస్ నెంబర్ 176 పరిధిలో వీఆర్వో బలివాడ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు.



స్లిప్పులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రేపు బృందాకారత్ రాక

పాలకొండ: మాజీ ఎంపీ, రాజ్యసభ మహిళా ఉద్యమనేత బృందాకారత్ ఆదివారం పాలకొండ రానున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు, సీపీఎం నేత దావాల రమణారావు తెలిపారు. వారు శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి అప్పలనర్స, పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవర చంటిబాబును గెలిపించాలని వారు కోరారు. బృందాకారత్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాము, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామలకు రహదారులేవీ?

సీతంపేట: గిరిజన గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదని బీఎస్పీ అరకు పార్లమెంట్ అభ్యర్థి లహరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఊయక భానుచందర్ అన్నారు. ద్వారబందం, లాడగూడ గ్రామాల్లో వారు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏనుగు గుర్తుపై ఓటు వేసి, తమను గెలిపించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు: విజయనగరంలోని ఒంటితడి సబ్‌స్టేషన్ పరిధిలో పాత విద్యుత్ లైన్ల షిఫ్టింగ్, నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఆప రేషన్)హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా విజయనగరం రూరల్ పరిధిలోగల ముడిదాం, సుంకరిపేట, చెల్లూరు, కోరాడపేట, చాకలిపేట, గుండాల పేట, గొల్లలపేట, వీటి అగ్రహారం, బీసీ కాలనీ, సంతోష్ నగర్, గణేష్ నగర్, వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. కావున వినియోగ దారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

రేపు ఉంగరాడమెట్ట పరిధిలో..

రేగిడి: ఉంగరాడమెట్ట విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఈనెల 5న రేగిడి మండల కేంద్రం ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయను న్నామని స్థానిక విద్యుత్ ఏఈఈ ఎల్ హరిబాబు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు రేగిడి, ఆమదాలవలస గ్రామాలతో పాటు, మండల కాంప్లెక్స్‌లో ఉన్న అన్ని కార్యా లయాలు, ఇంకా రక్షితమంచి నీటిపథకాల ఫీడర్‌కు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాన్ని పార్టీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో కూటమి మద్దతుతో పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి జగదీశ్వరి విజయం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు కూటమి విజయానికి కష్టించి పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిడ్డిక పద్మావతి, మన్నంగి భూషణరావు, కళావతి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

జామి: రామయ్యపాలెంలో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని జామి పోలీసులకు అప్పగించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి లక్ష్మి తెలిపారు. శుక్రవారం దాడులు నిర్వహించగా, తాండ్రంగికి చెందిన ప్రకాశ్ వద్ద ఈ బాటిళ్లు గుర్తించామన్నారు. వీటిని ఎస్ఐ సమక్షంలో అప్పగించామన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 65 వ ఆవిర్భావ దినో త్సవ కార్యక్రమాన్ని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి ఎస్.గణపతి ఆధ్వర్యంలో స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో శుక్రవారం జరుపుకున్నారు. జిల్లా సీపీఐ కార్య దర్శి ఒమ్మి రమణ సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అల్లూరి సీతారామరాజు, చేగువేరా వంటి యువజన విప్లవకారుల స్ఫూర్తితో ఏఐవైఎఫ్ వీరోచితంగా పోరా డుతోందని అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యలతో పాటు అనేక సమస్యలు పెచ్చుమీరిపోతున్నాయన్నారు. పాలకుల దుర్నీతి విధానాలే ఇందుకు కారణమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం లేనిపోని హామీలు ఇస్తూ వాటిని అమలు చేయ కుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం కు ట్ర పన్నుతుంటే జగన్ చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీ లేకుండా దగా డీఎస్సి తెచ్చారని, జాబ్‌క్యాలెండరు ఊసేలేదన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు నివార్యమవుతాయని ఆయన అన్నారు.